సాక్షి జనగామ

గురువారం | 20 | ఏప్రిల్ | 2023



'హద్దు' దాటినా చర్యల్లేవు!

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోదావరి పై రోడ్డు వేసి ఇతర జిల్లాలకు ఇసుకను తరలిస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. - 8లో▸



బీజేపీని నమ్మొద్దు

రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతున్న బీజేపీని నమ్మొద్దని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తొర్రూరులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
41⁰ /25⁰

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వేడి గాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోత ఉంటుంది.



న్యూస్‌రీల్

అదనపు జిల్లా జడ్జిల బదిలీ



డి.రవీంద్రశర్మ
జిల్లా న్యాయమూర్తి

వరంగల్ లీగల్: వరంగల్ ఉమ్మడి జిల్లాలో పలువురు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ హైకోర్టు అధికార వర్గాలు బుధవారం ఉత్తర్వులు జారీ చేశాయి. వరంగల్ జిల్లా మొదటి అదనపు కోర్టు జడ్జి సి.పావని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తిగా బదిలీ కాగా, ఆ స్థానంలో సూర్యాపేట జిల్లా జడ్జి జి.ప్రేమలతను నియమించారు. హనుమకొండ జిల్లా రెండవ అదనపు కోర్టు, ఫ్యామిలీ కోర్టు జడ్జి ఎం.పద్మజను హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టుకు, అక్కడి న్యాయమూర్తి బి.అపర్ణదేవిని హనుమకొండ జిల్లా ఫ్యామిలీ కోర్టు జడ్జిగా బదిలీ చేశారు. మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.వసంత్‌పాటి ల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖర్‌లను ఒకరి స్థానంలో ఒకరిని బదిలీ చేశారు. ఖాళీగా ఉన్న జనగామ జిల్లా ప్రధాన న్యాయమూర్తి స్థానంలో అసిఫాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మను నియమించారు.

మంత్రి ఎర్రబెల్లికి సత్కారం



జనగామ: తెలంగాణ రాష్ట్రం అత్యధికంగా జాతీయ స్థాయి ఉత్తమ జీపీ అవార్డులు అందుకున్న సందర్భంగా రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును బుధవారం పాలకుర్తి క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ సత్కరించారు. అలాగే హనుమకొండలోని స్వగృహంలో మంత్రిని రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డీవీఆర్.శర్మ, పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ ధర్మకర్త నర్సింహారెడ్డి.. స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించారు.

ఉపాధి పనులు అందరికీ ఉపయోగపడాలి



చిల్పూరు: గ్రామాల్లో చేపట్టే ఉపాధి పనులు అందరికీ ఉపయోగ పడేలా ఉండాలని డీఆర్‌డీఓ గూడూరు రాంరెడ్డి అన్నారు. నష్కల్ గ్రామం నుంచి చిన్నరాయకుంట వరకు బీటీ రోడ్డు వెంట ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఫీడర్ చానల్ కాల్వ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే వర్షాకాలం వరకు వర్షపు నీరు వృథా పోకుండా ఎక్కడికక్కడి చెరువులు, కుంట్లోకి వెళ్లేలా పనులు చేయించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ మధుసూదనాచారి, సర్పంచ్ కర్ణకంటి స్వప్నవెంకటేష్, ఉప సర్పంచ్ చిర్ర రాజు, టీసీలు రజని, సింగపురం కిరణ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ బాలస్వామి, పంచాయతీ కార్యదర్శి స్నేహ పాల్గొన్నారు.

సర్కారు స్కూళ్లలోనే నాణ్యమైన విద్య



కొడకండ్ల: సర్కారు స్కూళ్లలోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచేత నాణ్యమైన విద్యాబోధన అందుతోందని డీఈఓ కె.రాము అన్నారు. బుధవారం మండల పరిధి పెద్దబాయితండా ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలల్లో సకల సదుపాయాలు కల్పిస్తూ.. విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారంతో కూడిన రాగిజావ అందిస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు స్కూళ్లలో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతి, మండల నోడల్ ఆఫీసర్ గ్రేస్‌కె జీయారాణి, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ రామరాజు, సర్పంచ్, ఎంపీటీసీ సునీత, రాంకోటి, హెచ్‌ఎం అనిల్, ఎస్‌ఎంసీ చైర్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

తాడోపేడో..!



జిల్లా పరిషత్ కార్యాలయం

తేల్చుకోవడానికి సిద్ధమవుతున్న జెడ్పీటీసీలు

- మిగిలిన గడువు ఐదు రోజులే..
- నాలుగేళ్ల నిధులు.. ఖర్చులపై నివేదికకు డిమాండ్
- చైర్మన్‌పై వచ్చిన భూదందా ఆరోపణలపై చర్చ..?
- లెక్కలు చూపించకుంటే అవిశ్వాసం వైపు అడుగులు
- తారస్థాయికి చేరిన జిల్లా పరిషత్ వివాదం

జనగామ: ఇటీవల జనగామ మున్సిపల్ అవిశ్వాస రాజకీయం అధికార పార్టీలో అలజడి రేకెత్తించగా.. తాజాగా జిల్లా పరిషత్ వివాదం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జెడ్పీ చైర్మన్ సొంత నిర్ణయాలు.. నిధుల కేటాయింపులో వివక్ష.. ఇటీవల ఆయనపై వచ్చిన భూదందా ఆరోపణల నేపథ్యంలో జెడ్పీటీసీలు గుర్రుగా ఉన్నారు. రెండు రోజుల క్రితం జరిగిన స్థాయీ సంఘాల సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు దూరంగా ఉండే ప్రయత్నం చేయగా.. చైర్మన్ బుజ్జగింపుతో శాంతించారు. ప్రభుత్వం విడుదల చేసే నిధులు మండలాల వారీగా సమాన ప్రాతిపదికన కేటాయించాలని సభ్యుల డిమాండ్. ఈ మేరకు జెడ్పీ చైర్మన్ సభ్యులతో జరిగిన చర్చలు సఫలం కాకపోవడంతో గడిచిన నాలుగు సంవత్సరాల లెక్కలు చూపించాలని.. ఇందుకు ఈనెల 24 వరకు డెడ్‌లైన్ విధించినట్లు సమాచారం.

భూదందా ఆరోపణలపై చర్చ..?

ఇటీవల జెడ్పీ చైర్మన్‌పై వచ్చిన భూదందా ఆరోపణలతో జిల్లా పరిషత్ ప్రతిష్టకు భంగం వాటిల్లినట్లు సభ్యులు ఒకింత ఆవేదనకు గురైనట్లు సమాచారం. పలువురు రైతులు జెడ్పీ చైర్మన్‌ను టార్గెట్ చేస్తూ.. నేరుగా ఆరోపణలు చేసినా నామమాత్రపు ఖండనలతో సరిపెట్టడం వెనుక మతలబు ఏమిటనే అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. దీనిపై మెజార్టీ సభ్యులు అధిష్టానికి ఫిర్యాదు చేసే ఆలోచనలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

నిధులు.. ఖర్చులపై నివేదిక కోరిన సభ్యులు

స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఎస్‌ఎఫ్‌సీ), 15వ ఆర్థిక సంఘం నిధులు, సర్కారు నుంచి వచ్చే స్పెషల్ గ్రాంట్ నిధుల్లో జెడ్పీ చైర్మన్ వాటా కింద 30శాతం, మిలిగిన నిధుల్లో 11 మంది జెడ్పీటీసీలకు కేటాయించడంపై వివాదం తలెత్తింది. జెడ్పీ చైర్మన్‌తో సహా మిగతా వారికి సమాన ప్రాతిపదికన నిధులను కేటాయించి.. అన్ని గ్రామాల్లో అభివృద్ధి జరిగేలా చూడాలని సభ్యుల వాదన. కొంత కాలంగా జెడ్పీ చైర్మన్, జెడ్పీటీసీల మధ్య చెలరేగిన ఈ వివాదం.. మొన్నటి స్థాయీ సంఘాల సమావేశంతో బహిర్గతమైయింది. జెడ్పీ చైర్మన్ కోరిక మేరకు జెడ్పీటీసీలతో జరిగిన చర్చల్లో క్లారిటీ రాకపోవడంతో ప్రస్తుత పాలక మండలికి సంబంధించిన నాలుగు సంవత్సరాల ఖర్చులపై లెక్కలు చూపించాలని పట్టుబడుతున్నారు. ఈనెల 24వ తేదీ వరకు డెడ్‌లైన్ విధించిన జెడ్పీటీసీలు.. అప్పటి వరకు వేచి చూడాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జెడ్పీ నుంచి లెక్కలకు సంబంధించిన సమగ్ర సమాచారం రాకుంటే మరో 15 రోజుల్లో నిర్వహించే సర్వసభ్య సమావేశానికి గైర్హాజర్ కావాలని మెజార్టీ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిసింది. అంతేకాకుండా జెడ్పీ చైర్మన్‌పై అవిశ్వాస నోటీసులు సైతం ఇవ్వాలని అనుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

నిధుల ఖర్చులో తేడా ఉందా..?

జిల్లా పరిషత్ కార్యాలయ సాధారణ ఖర్చులపై జెడ్పీటీసీల పట్టుతో.. ఇందులో గోల్‌మాల్ జరిగిందా అనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. సమావేశాలు, సమీక్షలు, డీజిల్ వినియోగం, మెటీరియల్ కొనుగోలు తదితర వాటిలో అసలుకు మించి లెక్కలు చూపిస్తున్నారా అనే దానిపై జెడ్పీటీసీలు సందేహ పడుతున్నట్లు తెలుస్తున్నది. అందుకే నాలుగేళ్లకు సంబంధించిన ప్రతిపైసా ఖర్చు వెనక బిల్లుతో సహా వ్యక్తిగతంగా నివేదికలు ఇవ్వాలని జెడ్పీటీసీలు పట్టుబడుతున్నారు. నిధుల ఖర్చుపై జెడ్పీ నుంచి సమాచారం వచ్చిన తర్వాత అక్రమాలు జరిగాయా.. లేదా అనే విషయం తెలియనుంది.

దసరా నాటికి వరంగల్ హెల్త్ సిటీ!



నిర్మాణంలో వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి





మల్టీ సూపర్‌స్పెషాలిటీ నిర్మాణంపై మంత్రి హరీష్ సమీక్ష, కేటీఆర్ చేసిన ట్వీట్

- పనుల వేగం మరింత పెంచి పూర్తి చేసేలా చర్యలు
- హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావు ఉన్నతస్థాయి సమీక్ష
- వరంగల్ మల్టీ స్పెషాలిటీ పూర్తయితే మెడికల్ హబ్
- తెలంగాణలో అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రి : ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్

సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్రానికి తలమానికం కానున్న వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పనులు దసరా నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. పనుల పురోగతిపై రోజువారీగా సమీక్ష నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌డీలో వరంగల్ హెల్త్ సిటీ మెడికల్ కాలేజీల పనులు పురోగతి, ఇతర అంశాలపై బుధవారం మంత్రి హరీశ్‌రావు ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించే దిశగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో విప్లవాత్మమైన చర్యలు తీసుకుంటున్నారన్న మంత్రి హరీశ్.. దసరా నాటికి వరంగల్ మల్టీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. వరంగల్ హెల్త్ సిటీ నిర్మాణ పనుల వేగం పెంచాలని సూచించారు. దసరా నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందులో భాగంగా ఒక వైపు వైద్యం, మరోవైపు వైద్య విద్యను విస్తృతం చేస్తున్నట్లు చెప్పారు. వరంగల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తయితే మెడికల్ హబ్‌గా మారుతుందన్నారు. ఇందులో అత్యాధునిక వైద్య పరికరాలు సమకూరుస్తున్నట్లు చెప్పారు. అత్యాధునిక మాడ్యులర్ థియేటర్లు, ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందే అవకాశమే లేకుండా ఎయిర్ హ్యాండ్లింగ్ యూనిట్స్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. వరంగల్ హెల్త్ సిటీ నిర్మాణాలకు సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ తరఫున అవసరమైన అన్ని చర్యలు పూర్తి చేశామని, ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

తెలంగాణలో అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రి : మంత్రి కేటీఆర్ ట్వీట్

వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం కోసం మంత్రి హరీశ్‌రావు హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహించగా.. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ వరంగల్ ఆస్పత్రి నిర్మాణం, ఆరోగ్య తెలంగాణ విషయంలో సీఎం కేసీఆర్‌కు ట్విట్టర్‌లో ధన్యవాదాలు తెలపారు. 'వరంగల్ నగరంలో 2000 పడకలతో తెలంగాణలోనే అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రి శరవేగంగా రాబోతుంది.. 33 జిల్లాల్లో ఒక మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ ఉండడం వల్ల ఇది ఆరోగ్య సంరక్షణ వికేంద్రీకరణలో ఒక పెద్ద ముందడుగు అవుతుంది.. ఆరోగ్య తెలంగాణ విషయంలో సీఎం కేసీఆర్ గారికి ధన్యవాదాలు' అంటూ ట్వీట్ చేశారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ జడ్జి ఆంజనేయులు



మాట్లాడుతున్న జడ్జి ఆంజనేయులు

బచ్చన్నపేట: సమాజంలో అధిక శాతం ఉన్న రైతులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.. ఇందుకు అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు దోహదపడతాయని జనగామ సీనియర్ జడ్జి ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు వ్యవసాయమే జీవనోపాధిగా జీవిస్తారని, కష్ట నష్టాలను తట్టుకుంటూ ఉంటారని అన్నారు. భూ సమస్యలు ఎదుర్కొంటున్నందున వారి పక్షాన నిలబడి పరిష్కరించేందుకు ఈ క్లినిక్‌ల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. మండల కేంద్రంలో పారా లీగల్ వలంటీర్ అందుబాటులో ఉంటారని, భూ సమస్యలపై తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే దశల వారీగా వాటిని పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా భూ సమస్యలపై 180 చట్టాలున్నాయని, వీటిపై అవగాహన ఉంటే సులువుగా పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా దాదాపు 200 మంది భూ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్, పారా లీగల్ వలంటీర్ పెరుమాళ్ల యాదగిరి, డీఎల్ఎస్ఏ సూపరింటెండెంట్ సీతారామరాజు, ఎస్సై నవీన్‌కుమార్, న్యాయవాదులు మంచాల రవీందర్, జ్యోత్స్న, ఇబ్రహీం, పీఎల్‌వీ.సుందరయ్య, ఏఈఓ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

లక్కీ నంబర్ @ రూ.6లక్షలు



లక్కీ నంబర్ దక్కించుకున్న నవీన్

జనగామ: పట్టణంలోని శ్రీవిల్లాస్ కాలనీకి చెందిన సాఫ్ట్ వేర్ ఉద్యోగి పెద్ది నవీన్‌కుమార్‌గౌడ్ నూతనంగా కొనుగోలు చేసిన కారుకు లక్కీ నంబర్‌ను ఆన్‌లైన్ వేలంలో రూ.5,99,999కి దక్కించుకున్నాడు. తెలంగాణ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ ఆన్‌లైన్ రిజర్వేషన్ పోర్టల్‌లో టీఎస్27 ఎఫ్ 9999 నంబర్ కోసం రూ.50వేల ఫీజు చెల్లించాడు. ఈ నంబర్‌కోసం బుధవారం నిర్వహించిన వేలంలో ఐదుగురు పోటీ పడ్డారు. అందరూ రూ.2 లక్షల నుంచి రూ.3లక్షల వరకు కోడ్ చేయగా.. నవీన్‌కుమార్ ఏకంగా రూపాయి తక్కువ రూ.6 లక్షలకు కోడ్ వేసి దక్కించుకున్నాడు.

పార్లమెంట్‌కు అంబేడ్కర్ పేరు పెట్టాలి

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి డిమాండ్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై ప్రేమ ఉంటే భారత పార్లమెంట్‌కు ఆయన పేరు పెట్టాలని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి నివాసంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు ఏనాడు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కాలేదని, అధికారమే లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రత్యేక తెలంగాణ సిద్ధించడానికి ఉద్యమంతోపాటు రాజ్యాంగంలోని ఆర్టికల్–3 ఎంతగానో పనిచేసిందని, సీఎం కేసీఆర్ తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని చెప్పారు. తనకు రాజకీయ జన్మనిచ్చిన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. అనంతరం పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న గుప్తా, నాయకులు బూర్ల శంకర్, నీల గట్టయ్య, తీగల కరుణాకర్, కుల్లా మోహన్‌రావు, నాగరబోయిన యాదగిరి, మామిడాల లింగారెడ్డి, రజాక్ యాదవ్, నీరటి ప్రభాకర్, ఎల్మకంటి నాగరాజు, రాజేష్‌నాయక్, వాంకుడోతు దశరథ్‌నాయక్, ఎడ్ల వెంకటస్వామి, జీడి ప్రసాద్ పాల్గొన్నారు.

తెల్లదొరల్లా దోచుకుంటున్నారు..

- టీపీసీసీ మాజీ అధ్యక్షుడు 'పొన్నాల'



విలేకరులతో మాట్లాడుతున్న పొన్నాల లక్ష్మయ్య

తరిగొప్పుల/నర్మెట: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు పన్నులు విధించి తెల్ల దొరల్లా ప్రజలను దోచుకుంటున్నాయని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా సీఎల్పీ నేత బట్టి విక్రమార్క చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్ర తరిగొప్పుల, నర్మెట మండలాలకు రానున్న నేపథ్యంలో పొన్నాల లక్ష్మయ్య బుధవారం పలు గ్రామాల్లో పర్యటించి రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారం కోసం కేంద్ర ప్రభుత్వం భాష, ప్రాంతం, కులం ప్రాతిపదికగా విభజించి పరిపాలిస్తూ ప్రాంతీయ పార్టీల ప్రభుత్వాలను తమ గుప్పిట్లో పెట్టుకుందని విమర్శించారు. సీఎం కేసీఆర్ దేశ రాజకీయాలను శాసించేలా.. ఎన్నికలకు పెట్టుబడి పెట్టే స్థాయికి ఎలా ఎదిగాడని ప్రశ్నించారు. తొమ్మిదేళ్ల పాలనలో ఆయన చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. గ్రామాల్లో వారానికి ఒక్కసారి మాత్రమే మిషన్ భగీరథ నీరువస్తుందని, మూడేళ్లుగా కొత్త పింఛన్ల జాడేలేదని, డబుల్ బెడ్రూం ఇళ్లు ఆశగానే మిగిలిపోయాయని విమర్శించారు. 16 లక్షల మంది కౌలు రైతుల గోడు ప్రభుత్వానికి వినిపించడం లేదా అని ప్రశ్నించారు. తరిగొప్పుల మండలం అబ్దుల్‌నాగారం, నర్సాపూర్, మరియాపురం మీదుగా ఈనెల 26న హాత్ సే హాత్ జోడో యాత్ర కొనసాగుతుందని చెప్పారు. చిలువేరు సంపత్, కొండల్‌రెడ్డి, లింగోజీ, పలుచాని రమేష్, కావటి సుధాకర్, జంగిటి అంజయ్య, మద్దూర్ జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి గొల్లపల్లి కుమారస్వామి, తరాల సమ్మయ్య, ఏడెల్లి శ్రావణ్‌రెడ్డి, సది, రాములు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ భూములకు పట్టా పుస్తకాలివ్వాలి

జనగామ రూరల్: మండల పరిధి గానుగుపహాడ్‌లోని సొసైటీ భూములకు పట్టా పుస్తకాలు ఇవ్వాలని జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాదం రమేష్ అన్నారు. బుధవారం గ్రామంలోని 127,138, 144 సర్వేనంబర్లలోని 117 ఎకరాల భూమిని వారు పరిశీలించిన అనంతరం మాట్లాడారు. 1995–96 మధ్యకాలంలో ఈ భూమిని జీవాలు మేపుకోవడానికి కేటాయించి సొసైటీకి పట్టా పుస్తకాలు అందజేశారని, అయితే తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ రికార్డుల్లో ఆభూమిని మాయం చేశారని అన్నారు. ఫారెస్ట్ అధికారులు కూడా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలరాజు, మోటే దేవేందర్, జి రాజు, సిద్దులు, ఐలయ్య, చంద్రయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- మాదాపురం ఎఫ్ఏను సస్పెండ్ చేయాలి
- అగ్నిమాపక శాఖ ఎన్ఓసీ తప్పనిసరి
- సమీక్షలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

జనగామ: అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి స్వచ్ఛ భారత్, ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్, ఎఫ్ఏలతో పాటు అన్ని మండలాల సిబ్బందితో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద ఒక గుంత మరుగుదొడ్డిని రెండు గుంతలుగా మార్చాలని, తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించి సెగ్రిగేషన్ షెడ్డులో ఎరువు తయారు చేసేలా అవగాహన పెంచాలన్నారు. గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో విలేజ్ సెల్ఫ్ అసెస్మెంట్ ఖచ్చితమైన సమాచారం నమోదు చేయాలని, ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత నిర్మించేలా దృష్టి పెట్టాలని చెప్పారు. ఉపాధి హామీ కూలీలకు సగటు వేతనం వచ్చేలా చూడాని అన్నారు.

ఉపాధి పనులపై ఆగ్రహం

ఉపాధి పనులకు కూలీలు తక్కువగా హాజరైన విషయమై.. దేవరుప్పుల మండలం మాదాపురం ఎఫ్ఏను సస్పెండ్ చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. గ్రామాల వారీగా అభివృద్ధి పనుల్లో వెనుకబడి ఉన్న సిబ్బందికి మెమోలు జారీ చేయాలని డీఆర్డీఓ రాంరెడ్డిని కోరారు. వీసీలో డీఆర్డీఓతోపాటు జెడ్పీ సీఈఓ వసంత, డీఎల్పీఓ పార్థసారథి, ఎస్‌బీఎం కరుణాకర్, సంబంధిత శాఖల సిబ్బంది ఉన్నారు.

అగ్నిమాపక శాఖ ఎన్ఓసీ తప్పనిసరి..

విద్యాసంస్థలు, ఫంక్షన్ హాళ్లు, హోటళ్లు తదితర సంస్థలు అగ్ని మాపక శాఖ ఎన్ఓసీ పొంది ఉండాలని అదనపు కలెక్టర్ సూచించారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు నివారణ చర్యలపై అగ్నిమాపక, జిల్లా పంచాయతీ, మున్సిపల్, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రద్దీ ప్రదేశాలు, ముఖ్యమైన కూడళ్లలో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. అవసరమైన సమయంలో మున్సిపాలిటీ, జిల్లా పంచాయతీ శాఖ సహకారం తీసుకోవాలని ఆదేశించారు. హోటళ్లు, విద్యాసంస్థలు, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక ఏరియాల్లో అగ్నిప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వ్యవసాయ మార్కెట్‌లతో పాటు పారిశ్రామిక సంస్థలు, అటవీ శాఖల పరిధిలో తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రజిత, డివిజనల్ పంచాయతీ అధికారి పార్థసారథి, అగ్నిమాపక శాఖ అధికారి కె.మధుకర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు రక్షణ కరువు



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

జనగామ: న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతోందని జనగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూరెళ్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ కోర్టు ఆవరణలో న్యాయవాది రవికాంత్‌రెడ్డిపై రౌడీషీటర్ దాడి చేయడాన్ని బుధవారం బార్ అసోసియేషన్ ఖండించింది. ఈ మేరకు చాంబర్‌లో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో గతంలో న్యాయవాదులు వామనరావు, నాగమణి దంపతులను కిరాతకంగా హత్య చేసిన సందర్భంగా ఆందోళనలు చేపట్టి న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని విన్నవించగా హామీ ఇచ్చిన ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదన్నారు. సమావేశంలో న్యాయవాదులు కాచరాజు హరిశ్చంద్రప్రసాద్, చిలువేరు సుధీరంజన్, కొరెడ్ల రవీందర్‌రెడ్డి, లక్ష్మణస్వామి, నాగరాజశర్మ, కర్ర ఎల్లారెడ్డి, శ్రీరామ్ శ్రీనివాస్, రాజయ్య, అశోక్ వర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్ యాదవ్, ఉమాపతి, ఎ.శ్రీనివాస్, బండి మధుసూదన్, బొట్ల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తికి కాంగ్రెస్ అభ్యర్థిని ఖరారు చేస్తాం



రేవంత్‌రెడ్డితో పాలకుర్తి నాయకులు

దేవరుప్పుల: పాలకుర్తి నియోజకవర్గం బరిలో కాంగ్రెస్ పక్షాన నిలిచి పార్టీకి పూర్వవైభవం తేవడానికి త్వరలో అభ్యర్థిని ఖరారు చేస్తామని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, జిల్లా నాయకులు అల్లం ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డిని కలిసి పార్టీ స్థానిక స్థితిగతుల గురించి వివరించారు. స్పందించిన రేవంత్.. పార్టీ బలోపేతానికి ప్రక్షాళన చర్యలు చేపట్టి పాలకుర్తికి నిఖార్సైన అభ్యర్థిని అప్పగిస్తామని, నిబంధనలు పాటిస్తూ సైనికుల్లా పనిచేయాలని సూచించినట్టు ప్రదీప్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ వరంగల్ పార్లమెంటు ఇన్‌చార్జ్ బి.శోభ, నాయకులు కాసారపు ధర్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, సదాకర్, రాజశేఖర్, యాకసోమయ్య, పులి గణేష్, కాసాని ఎర్రయ్య, గండిపెల్లి యాకయ్య, కమ్మగాని నాగయ్య, మురళీధర్ రెడ్డి, రవీందర్‌నాయక్, రాహుల్, మహేందర్‌రెడ్డి, శ్యామ్, రవినాయక్, కుందూరు రామిరెడి, హరీష్, సైదుల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తుల సరఫరాకు టెండర్ల స్వీకరణ

జనగామ రూరల్: తెలంగాణ గురుకుల మైనార్టీ బాలుర పాఠశాల జనగామ, బాలికల పాఠశాల స్టేషన్‌ఘన్‌పూర్ అలాగే కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరం ఆహార ఉత్పత్తుల సరఫరాకు సీల్డ్ టెండర్లు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ శివలింగయ్య, మైనార్టీ అధికారి ఇస్మాయిల్ ఒక ప్రకటనలో తెలిపారు. కిరాణా సరుకులు, కూరగాయలు, చికెన్, పండ్లు, గుడ్ల టెండరు ఫారం ధర రూ.2000 ఫారం ధర ఉంటుందని,కిరాణా సరుకులకు దరావత్ రూ.లక్ష, చికెన్‌కు రూ.50,000 ఉండాలని పేర్కొన్నారు.మరిన్ని వివరాలకు 96036 28326, 99519 33034 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మోకాళ్ల చికిత్స పేరిట బురిడీ

- నకిలీ వెబ్‌సైట్ మోసపూరిత ప్రకటన
- రూ.94,900 పోగొట్టుకున్న విశ్రాంత ఉపాధ్యాయుడు

గార్ల: మోకాళ్ల నొప్పుల చికిత్స కోసం నకిలీ వెబ్ సైట్ ద్వారా గార్ల మండలం రాంపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ బోళ్ల వెంకట్‌రెడ్డి రూ.94,900 పోగొట్టుకున్నాడు. మోకాళ్ల నొప్పుల చికిత్స కోసం పతంజలి యోగ్ పీఠ్ వెబ్‌సైట్ చూశాడు. ఇందులో ఉన్న టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి చికిత్స వివరాలు తెలుసుకున్నాడు. తొలుత రూ.21,000 నగదు చెల్లించాలని వెబ్‌సైట్ నిర్వాహకులు చెప్పారు. అనంతరం బ్యాంకు అకౌంట్ నంబర్ ఇవ్వడంతో.. వెంకట్‌రెడ్డి మొదట అకౌంట్‌కు రూ.21,000 పంపించాడు. ఇంకా నగదు పంపించాలని అవతలి వ్యక్తి కోరడంతో వెంకట్‌రెడ్డి నాలుగు దఫాలుగా రూ.94,900 పంపించాడు. నగదు మొత్తం పంపించిన తర్వాత వెబ్‌సైట్ నిర్వాహకులు ఫోన్ లేపకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబర్ 1903కు ఫోన్ చేశాడు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై బానోత్ వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భద్రకాళి బ్రహ్మోత్సవాలకు రండి

- ఎంపీ జోగినపల్లికి ఆహ్వానం



జోగినపల్లికి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈఓ శేషుభారతి

హన్మకొండ కల్చరల్ : ఈ నెల 22 నుంచి జరగనున్న భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణబ్రహ్మోత్సవాలకు రావాలని బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్‌ను ఈఓ శేషుభారతి, పర్యవేక్షకులు అద్దంకి విజయ్‌కుమార్, సిబ్బంది ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఉన్నారు.

21న ఆన్‌లైన్ తరగతుల యాప్‌పై అవగాహన

హన్మకొండ: ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ తరగతుల యాప్‌పై ఈ నెల 21న ఉదయం 9 గంటలకు హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాప్‌ను చక్రవర్తి ఈ – క్లాస్‌రూం వారితో రూపొందించినట్లు తెలిపారు. ఇందులో 57 రకాల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలతోపాటు, వివిధ రాష్ట్రస్థాయి పోటీ పరీక్షల వీడియో తరగతులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు సంబంధించి ఇంగ్లిష్ మీడియంలో, రాష్ట్ర ప్రభుత్వ పోటీ పరీక్షల వీడియోలు తెలుగులో ఉంటాయని వివరించారు. ఈసౌకర్యాన్ని నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యాప్‌లో ఉచిత శిక్షణ నమోదు కోసం 86880 98700 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

‘హద్దు’ దాటినా చర్యల్లేవు!

- రాత్రి లోడింగ్.. పగలు బంద్
- అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారులు
- అడ్డుకున్న తహసీల్దార్ బదిలీ

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోదావరిపై అక్రమంగా రోడ్డు వేసి మంచిర్యాల జిల్లా కొల్లూరుకు హద్దులు దాటి ఇసుకను తరలిస్తున్నా.. సంబంధిత అధికారులు మౌనం పాటిస్తున్నారు. మంగళవారం రాత్రికి రాత్రే పొక్లెయిన్‌లతో మద్దులపల్లి సమీపంలోని బల్లాపూర్ వద్ద టిప్పర్లతో గోదావరిలో ఇసుకను కొల్లూరుకు తరలించి ఇసుకాసురులు సొమ్ము చేసుకున్నారు. అనుమతులు ఉన్నాయని చెబుతున్న కాంట్రాక్టర్లు.. పగలు ఇసుక లోడింగ్ నిలిపి రాత్రి వేళల్లో ఎందుకు రహస్యంగా లోడింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా.. ఈఅక్రమ దందాపై సంబంధిత టీఎస్ఎండీసీ, మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసుశాఖలు అలసత్వం ప్రదర్శిస్తుండడం విమర్శలకు దారి తీస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలం కావడంతో అధికారులపైన కాంట్రాక్టర్లదే పై చేయి అన్నట్లు కనిపిస్తోంది. అక్రమ దందాను అడ్డుకుందామని వెళ్లిన తహసీల్దార్ శంకర్‌ను సదరు కాంట్రాక్టర్లు బెదిరించి పంపడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. బుధవారం మధ్యాహ్నం తహసీల్దార్‌ను బదిలీ చేస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు రావడంతో.. ఇది ఇసుకాసురుల పనేనని చర్చ జరిగింది. కానీ.. అసలు విషయం బయటికి రాలేదు. ఈ దందాకు అధికారులే సహకరిస్తుండడంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడనుందని విమర్శలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక లోడింగ్‌పై చర్యలు తీసుకోవాలని మద్దులపల్లి, పలుగుల, కుంట్లం గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై టీఎస్ఎండీసీ పీఓ తారక్‌నాథ్‌రెడ్డిని ఫోన్ ద్వారా ప్రయత్నించినా.. అందుబాటులోకి రాలేదు. తహసీల్దార్ శంకర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా.. ‘అక్రమంగా మట్టి రోడ్డు వేశారు. గోదావరిలో మట్టి రోడ్డుపైన అనుమతులు ఇవ్వమనగా బకెట్ వేసి చంపుతామని బెదిరించారు. ఆతర్వాత క్షమించండి. అని చెప్పారు’ అని తహసీల్దార్ బదులిచ్చారు. బదిలీ విషయం అడగ్గా.. బదిలీకి ఇసుక రవాణాకు సంబంధం లేదని, మామూలుగానే బదిలీ జరిగిందని ఆయన పేర్కొన్నారు.



గోదావరిలో రాత్రి లోడింగ్ చేస్తున్న పొక్లెయిన్

ఇసుక మాఫియా ఇన్‌ఫ్లూయెన్స్‌తోనేనా?



మహదేవపూర్: ఇసుక మాఫియా ఇన్‌ఫ్లూయెన్స్‌తోనే తహసీల్దార్ శంకర్ జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారనే విమర్శలు మండలంలో వెల్లువెత్తున్నాయి. గోదావరి నుంచి ఇసుక తరలింపు చేట్టేందుకు కాంట్రాక్టర్ నేరుగా నదిలో రోడ్డు నిర్మిస్తుండగా.. తహసీల్దార్ అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆ మరుసటి రోజే తహసీల్దార్ బదిలీ అవ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది.

పాపను దత్తత ఇచ్చిన నలుగురిపై కేసు

గార్ల: ప్రభుత్వ అనుమతి లేకుండా పాపను అక్రమంగా దత్తత ఇచ్చిన, తీసుకున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న బుధవారం తెలిపారు. గార్ల మండలం సత్యనారాయణపురం పంచాయతీ ఇందిరానగర్ గ్రామానికి చెందిన మాలోత్ వెంకటేశ్ ఉమకు తొలుత ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. మూడో కాన్పులో సైతం మళ్లీ ఆడపిల్లే పుట్టడంతో సాకలేక, వారికి తెలిసిన బయ్యారం మండలం జగ్గతండాకు చెందిన కొమ్రాజుల నాగరాజు స్వప్న దంపతులకు పాపను దత్తతగా ఇచ్చారు. విషయం తెలుసుకున్న జిల్లా చైల్డ్ లైన్, ఐసీడీఎస్ అధికారులు కొద్ది రోజుల క్రితం ఇందిరానగర్‌కు చేరుకొని వెంకటేశ్–ఉమను ప్రభుత్వ అనుమతి లేకుండా దత్తత ఇస్తే, దత్తత ఇచ్చిన, తీసుకున్న జంటలపై కేసులు అవుతాయని పేర్కొన్నారు. వెంకటేశ్ బయ్యారం వెళ్లి పాపను ఇంటికి తెచ్చుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద పాప బాగోగులు చూసేందుకు వెంకటేశ్ ఇంటికి వెళ్లగా.. పాప కనిపించలేదు. పాప ఎక్కడ ఉందని వెంకటేశ్‌ను అడిగితే సరైన సమాధానం చెప్పలేదు. దీంతో గ్రామంలో పలువురిని విచారించగా.. మళ్లీ పాపను నాగరాజు, స్వప్న దంపతులకు ఇచ్చినట్లు తెలిసింది. సూపర్‌వైజర్ శారద స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇరువురు జంటలపై ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఎస్సై నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎనర్జీ ఆడిట్ చేపట్టాలి

హన్మకొండ: పట్టణాలు, మండల కేంద్రాల్లో ఎనర్జీ ఆడిట్ చేపట్టాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు సూచించారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఎంఆర్టీ విభాగం డివిజన్ ఇంజనీర్ల సమీక్ష సమావేశం జరిగింది. గోపాల్‌రావు మాట్లాడుతూ.. రెవెన్యూ తీసుకురావడంలో మీటరింగ్, బిల్లింగ్‌ల ఎంఆర్టీ విభాగం ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల్లో నాణ్యత ఉండేలా చూడాలని, ప్రతీ పని నాణ్యతగా జరగాలని, కంపెనీ అభివృద్ధిలో ఎంఆర్టీ విభాగం పాలుపంచుకోవాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌల్ట్రీ ఫెడరేషన్ రీజినల్ నూతన కమిటీ ఎన్నిక



పౌల్ట్రీ ఫెడరేషన్ రీజినల్ నూతన కమిటీ ఇదే..

కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్ రోడ్డులోని బీవీ.రావు భవన్‌లో బుధవారం తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ వరంగల్ రీజియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కోళ్ల రైతులు పాల్గొని రీజినల్ నూతన కమిటీ అధ్యక్షుడిగా వేనెపెల్లి రామారావు, కార్యదర్శిగా సీహెచ్.దేవేందర్‌రెడ్డి, కోశాధికారిగా నెమిరిగొమ్ముల వేణురావు, సభ్యులుగా గులాం సంధాని, గాదె రాజేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి వరంగల్ పౌల్ట్రీ ఫార్మర్స్, హైదరాబాద్ పౌల్ట్రీ ఫార్మర్స్ నూతన కమిటీని అభినందించి పుష్పగుచ్ఛాలు అందించారు. కార్యక్రమంలో టీపీఎఫ్ రాష్ట్ర నాయకులు కాసర్ల మోహన్‌రెడ్డి, భాస్కర్‌రావు, హరిబాబు, సుబ్రహ్మణ్యం, శ్యాంసుందర్‌రావు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంతుల్లో డీజిల్ లోకో షెడ్

- నేడు గోల్డెన్ జూబ్లీ వేడుకలు
- రైల్వే జీఎం చేత పలు ప్రారంభోత్సవాలు

కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్ లోకో షెడ్ విద్యుత్ కాంతులతో మెరిసిపోతోంది. గురువారం జరిగే డీజిల్ లోకో షెడ్ గోల్డెన్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకుని రైల్వే అధికారులు షెడ్ ప్రాంగణమంతా విద్యుత్ దీపాలతో అలంకరించారు. రైల్వే అధికారులు ఉత్సవాలకు సంబంధించి బిజీబిజీగా ఉన్నారు. గోల్డెన్ జూబ్లీ వేడుకలకు సంబంధించి అన్ని విభాగాలు, కార్యాలయాలు సుందరంగా అలంకరించి సర్వం సిద్ధం చేశారు.

నేడు రైల్వే జీఎం రాక

గోల్డెన్ జూబ్లీ వేడుకలకు రైల్వే జీఎం ఎకె.జైన్ ముఖ్య అతిథిగా రానున్నారు. సికింద్రాబాద్ నుంచి రైల్వే జీఎం ప్రత్యేక రైల్లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటారు. షెడ్‌లో జీఎం పాల్గొని ప్రారంభించేవి, బ్యాలెన్సింగ్ మిషన్, షెడ్ విస్తరణ టీఎంఅండ్ యూటీ పనులను ప్రారంభిస్తారు. టెక్నికల్ స్టాల్‌ను సందర్శిస్తారు. డీఎం ప్లాంట్, సింటెడ్ బ్రాంజ్ ఫిల్టర్ క్లీనింగ్ మిషన్, బ్యాటరీ షెడ్, టెక్నికల్ సెమినార్ మీటింగ్, ప్రదర్శన సందర్శన, స్కౌట్ అండ్ గైడ్స్ స్వాగతం, సావనీర్ ఆవిష్కరణ, డీజిల్‌షెడ్ సాధించిన అభివృద్ధిపై వీడియో, జీఎం చేత అవార్డుల ప్రధానం ఇతర కార్యక్రమాల్లో పాల్గొని రాత్రి 8 గంటలకు డిన్నర్ తర్వాత జీఎం 8:15 గంటలకు ప్రత్యేక రైల్లో జీఎం సికింద్రాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు.



కాంతులీనుతున్న డీజిల్ లోకో షెడ్

21నుంచి కోమటిపల్లి రైల్వే గేట్ మూసివేత

కాజీపేట సబ్‌డివిజన్ పరిధి కోమటిపల్లి రైల్వే గేట్‌ను ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు మూసివేయనున్నట్లు బుధవారం కాజీపేట రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే ట్రాక్ మరమ్మతు కారణంగా కోమటిపల్లి రైల్వే గేట్ నంబర్ 2ను మూసిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రజలు, వాహనదారులు సహకరించి రైల్వేశాఖకు తోడ్పడాలని వారు కోరారు.

అభివృద్ధికి అడ్డుపడుతున్న బీజేపీ



మంత్రి ఎర్రబెల్లి దంపతులను గజమాలతో సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: తెలంగాణ అభివృద్ధికి నిరంతరం అడ్డుపడుతున్న బీజేపీని నమ్మొద్దని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని రామ ఉపేందర్ గార్డెన్‌లో వెలికట్ట, నాంచారీమడూరు గ్రామాలు, బోజ్యా, టీక్యా, పెద్దమంగ్యా తండాల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్మన్ ఉషా దయాకర్‌రావు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి ఇప్పటికే రూ.2.50 లక్షల కోట్లు పన్నుల రూపంలో కేంద్రానికి చెల్లిస్తే, తిరిగి కేవలం రూ.1.50 లక్షల కోట్ల నిధులు మాత్రమే ఇచ్చారని, మిగిలిన రూ.1 లక్ష కోట్ల నిధులను బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాలకు కేటాయిస్తూ అన్యాయం చేస్తున్నారన్నారు. కేంద్రంపై పోరాటం చేస్తున్న సీఎం కేసీఆర్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మంత్రి ఎర్రబెల్లి దంపతులను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సీతారాములు, ఎంపీపీ అంజయ్య, జెడ్పీటీసీ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్‌రావు, ఈజీఎస్ స్టేట్ డైరెక్టర్ వెంకటనారాయణగౌడ్, రైతు మండల కో–ఆర్డినేటర్ దేవేందర్‌రెడ్డి, పార్టీ మండల కార్యదర్శి ప్రమోద్, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్ రెడ్డి, సర్పంచ్‌లు పుష్పలీల, యాదలక్ష్మి, కాలునాయక్, శోభన, శారద, ఎంపీటీసీలు సుకన్య రెడ్డి, మల్లమ్మ, పార్టీ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విస్తృత సేవలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి



సమీక్షలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

- వరంగల్ డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు

హన్మకొండ: నాబార్డు అందిస్తున్న ఆర్థిక సహాయంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు వ్యాపార సేవలు విస్తరించి ఆర్థికాభివృద్ధి సాధించాలని వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. బుధవారం డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ప్రాథమిక సహకార సంఘాల బలోపేతానికి నాబార్డు అందించిన ఆర్థిక సహాయంతో చేపట్టిన వ్యాపార విస్తరణ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం జరిగింది. ఇందులో నాబార్డు డీడీఎం చంద్రశేఖర్, బ్యాంక్ సీనియర్ అధికారులతో కలిసి మార్నేని రవీందర్‌రావు సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని 50 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి నాబార్డు ద్వారా మూడు విడతలుగా అందించిన రూ.54.53 కోట్ల రుణ వితరణతో మొత్తం 129 ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ఇంకా 20 సహకార సంఘాల బలోపేతానికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను రవీందర్‌రావు ఆదేశించారు. సమావేశంలో బ్యాంకు సీఈఓ చిన్నారావు, జనరల్ మేనేజర్ శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

పరీక్ష రాసి వస్తూ పరలోకాలకు..

- వెనుక నుంచి లారీ ఢీకొని యువకుడి దుర్మరణం
- మరొకరికి గాయాలు



ప్రణయ్(ఫైల్)

ఎల్కతుర్తి: పరీక్ష రాసి వస్తుండగా.. ఓ లారీ విద్యార్థి ప్రాణాన్ని బలిగొంది. బుధవారం భీమదేవరపల్లి మండలం గాంధీనగర్‌కు చెందిన మండ ప్రణయ్(21) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రణయ్ మండలంలోని వల్భాపూర్‌లో గల ఎస్సార్ఆర్ ఫార్మసీ కళాశాలలో థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. సెకండియర్ చదివే తన స్నేహితుడు కోట మహేందర్‌రెడ్డితో కలిసి హనుమకొండలోని ఎస్‌వీఎస్ కళాశాలలో పరీక్ష రాసి తిరిగి మాణిక్యాపూర్‌కు బైక్‌పై బయల్దేరాడు. మార్గమధ్యలోని హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారి ఎల్కతుర్తి శివారులో లారీ వీరి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన ప్రణయ్ అక్కడికక్కడే మృతి చెందగా.. వెనకాలే కూర్చున్న మహేందర్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని హుజూరాబాద్ మార్చురీకి తరలించినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. కాగా ప్రణయ్ హెల్మెట్ పెట్టుకుంటే బతికేవాడని స్థానికులు తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి మృతి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బుధవారం రోడ్డు, రైలు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా.. ఒక చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందింది.

రైలు ఢీకొని మహిళ మృతి..



గుర్తు తెలియని మహిళ మృతదేహం

నెక్కొండ: నెక్కొండ రైల్వే స్టేషన్ పరిధిలో రైల్వే ట్రాక్ దాటుతున్న క్రమంలో ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో గుర్తు తెలియని మహిళ(50) మంగళవారం రాత్రి 10 గంటలకు ట్రాక్ దాటుతోంది. ఈక్రమంలో లక్నో ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదవశాత్తు ఆమెను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలై రక్తస్రావంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు శవ పంచనామా నిర్వహించారు. మహిళ మృతదేహంపై గ్రీన్ అండ్ ఆరెంజ్ చుక్కల చీర, గ్రీన్ కలరు జాకెట్ ఉన్నట్లు ఆయన తెలిపారు. ఘటనాస్థలిలో ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రిలో భద్రపర్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఆచూకీ కోసం 9701747014, 94406 27532లో సంప్రదించాలని ఆయన సూచించారు.

బస్సు ఢీకొని యువకుడు..

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం మంజూర్‌నగర్ 8వ ఇంక్లైన్ క్రాస్ వద్ద బుధవారం బస్సు ఢీకొని మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన గట్టు రఘు(30) అక్కడికక్కడే మృతి చెందాడు. రఘు బైక్‌పై భూపాలపల్లికి వచ్చి తిరిగి పెద్దాపూర్‌కు వెళ్తుండగా.. కేటీకే ఎనిమిదో ఇంక్లైన్ క్రాస్ రోడ్డు వద్ద వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు రఘు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అతడి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య స్నేహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు.



ఘటనాస్థలిలో రఘు మృతదేహం

చికిత్స పొందుతున్న చిన్నారి..



నందిని(ఫైల్)

పాలకుర్తి టౌన్: ఈనెల 6న ఇద్దరు కూతుళ్లకు కూల్‌డ్రింక్‌లో క్రిమి సంహారక మందు కలిపి ఓ తండ్రి తాగించాడు. ఈఘటనలో ఒక కుమార్తె అదే రోజు మృతి చెందగా.. చికిత్స పొందుతూ బుధవారం మరో కుమార్తె నందిని(6) మృతి చెందింది. జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరు శివారు జానకీపురానికి చెందిన గుండె శ్రీనుకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. ఈనెల 10న ఇద్దరు కూతుళ్లకు కూల్‌డ్రింక్‌లో క్రిమిసంహారక మందు కలిపి శ్రీను తాగించాడు. చికెన్‌తో భోజనం పెట్టాడు. వీళ్లిద్దరూ అస్వస్థతకు గురవగా.. ఎంజీఎంకు తరలించి చికిత్స అందించారు. పెద్ద కూతురు నాగప్రియ అదే రోజు మృతి చెందగా.. నందిని పరిస్థితి విషమంగా ఉండడంతో.. పోలీసుల సాయంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లి చికిత్స అందించారు. తొమ్మిది రోజుల అనంతరం బుధవారం నందిని మృతి చెందింది. ఇద్దరు కూతుళ్ల చావుకు కారమణమైన శ్రీనును పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు.

స్పార్కిల్స్ వెలుగులు.. సమ్మర్ క్యాంప్‌లు

- ఆహ్లాదభరితంగా కార్యక్రమాలు
- పోస్టర్ ఆవిష్కరించిన పీఓ అంకిత్
- 22 నుంచి ప్రత్యేక శిక్షణ



స్పార్కిల్స్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీఓ అంకిత్, తదితరులు

ఏటూరునాగారం: పుస్తకాల పురుగుల్లా ఏడాదంతా గడిపిన విద్యార్థులకు ఆహ్లాదాన్ని పంచాలని గురుకులం సొసైటీ భావిస్తోంది. వారిలో ఉన్న నైపుణ్యాల్ని వెలికి తీసేందుకు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఆటపాటలతో పదిహేను రోజుల పాటు గడిపేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా స్పార్కిల్స్ పేరిట కార్యక్రమం చేపట్టబోతుంది. ఈనెల 22 నుంచి మే 6 వరకు ఐదు కేంద్రాల్లో సుమారు వెయ్యి మందికి ఈ ప్రత్యేక శిక్షణ చేపట్టనుంది. అందుకోసం ఇప్పటికే ఏర్పాట్లు మొదలుపెట్టారు గురుకులాల నిర్వాహకులు. వరంగల్, కరీంనగర్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల రీజియన్ల పరిధి గురుకులాల్లో సమ్మర్ క్యాంప్‌లను స్పార్కిల్స్ పేరుతో నిర్వహించనుంది. ఈకేంద్రాల్లో సోషల్ వెల్ఫేర్, ఏకలవ్య, మోడల్ స్కూల్, ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల్లోని 6 నుంచి 10వ తరగతి విద్యార్థులను ఎంపిక చేసి బాలురు, బాలికలకు వేర్వేరు క్యాంపులను ఏర్పాటు చేసి కార్యక్రమాలు చేపట్టనుంది. ములుగు జిల్లాలో ఏటూరునాగారం (బాలుర), జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కాటారం(బాలికలు), ములుగు(బాలురు), వరంగల్, కరీంనగర్ రీజియన్ పరిధిలోని అశోక్‌నగర్ సైనిక్ స్కూల్‌లో (బాలుర), సిరిసిల్లలోని గురుకులంలో (బాలికలు)ల క్యాంప్‌లను ఏర్పాటు చేసి ఒక్కో క్యాంప్‌లో 200ల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తుంది. సుమారుగా ఐదు క్యాంప్‌లలో వెయ్యి మంది విద్యార్థులకు 15 రోజుల పాటు లైవ్ స్కిల్స్, వెస్ట్రన్ డ్యాన్స్‌లు, సీపీఎస్ ప్రోగ్రాం, ఆర్ట్ డ్రాయింగ్ ఉంటాయి. డెయిలీ క్లాసులు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఫైర్ క్యాంప్‌లు, డ్యాన్స్‌లు, పాటలు పాడడం చేయిస్తారు. విద్యార్థులకు వేసవిలో ఆటవిడుపు, నైపుణ్యాల పెంపునకు నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

స్పార్కిల్స్(సమ్మర్ క్యాంప్)లను విజయవంతం చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో నాలుగు క్యాంప్‌లు, సిరిసిల్లలో ఒక క్యాంప్ ఏర్పాటు చేయడం జరుగుతుందని పీఓ వెల్లడించారు. ఈసందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో స్పార్కిల్స్ (సమ్మర్ క్యాంప్) పోస్టర్‌ను పీఓ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవి శిబిరాలు విద్యార్థులకు కొత్త నైపుణ్యాలను అన్వేషించడానికి, నేర్చుకోవడానికి ఒక వేదికను అందిస్తాయన్నారు. సొసైటీ సూచనలను పాటిస్తూ తమ వంతుగా కృషి చేసి ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని పీఓ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్సీఓలు డీఎస్ వెంకన్న, రాజ్యలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరాజు, సంగీత్‌సాగర్ పాల్గొన్నారు.

కంపెనీలో పనికి తరలిస్తున్న 30 మంది బాలల పట్టివేత

కాజీపేట రూరల్: దర్భాంగా– సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో బుధవారం రాత్రి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు బాలలను పనుల కోసం తరలిస్తున్నారనే సమాచారంతో ట్రైన్‌లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ డ్రైవ్‌లో సుమారు 30 మంది బాలల్ని అదుపులోకి తీసుకున్నారు. రాత్రి 10 గంటలకు కాజీపేట జంక్షన్‌కు ట్రైన్ రాగా.. బాలలను దింపివేసినట్లు ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు తెలిపారు. 18 ఏళ్లలోపు బీహార్‌కు చెందిన బాలలను బ్రోకర్స్ హైదరాబాద్ నగరంలో వివిధ ప్రైవేట్ కంపెనీల్లో పని చేయించేందుకు తరలిస్తున్నారని తెలిపారు. కాజీపేటలో అదుపులోకి తీసుకున్న బాలలను జీఆర్పీ పోలీసులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

బాలుడి ప్రాణం తీసిన నీటితొట్టె



వియాన్‌సింగ్ పటేల్(ఫైల్)

గూడూరు: నీటి తొట్టెలో పడి మండలంలోని జంగుతండా శివారు ఆగబోయిన రాములు తండాకు చెందిన ఈసం వీరస్వామి, వినీత దంపతుల ఏడాదిన్నర కుమారుడు వియాన్‌సింగ్ పటేల్ బుధవారం మృతి చెందాడు. వియాన్ ఇంటి ఎదుట ఆడుకుంటుండగా.. తల్లిదండ్రులు పనిలో నిమగ్నమయ్యారు. కొద్దిసేపటికి తల్లిదండ్రులు కుమారుడి కోసం వెతకగా.. ఎంతకూ కనిపించలేదు. చుట్టూ వెతకగా.. నీటి తొట్టెలో శవమై కనిపించాడు. కొడుకును చూసిన తల్లిదండ్రులిద్దరూ బోరున విలపించారు. వారిని ఆక్రందనలు చూసిన స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.